సాక్షి
వికారాబాద్
ఆదివారం । 3 । మార్చి । 2024



సన్న బియ్యం.. పిరం

బియ్యం ధరలు ఆకాశన్నంటుతున్నాయి. అంచనాకు మించి ధాన్యం దిగుబడులు వస్తున్నా బియ్యం ధరలు తగ్గడం లేదు. 8లో▸



కావాలనే తప్పుడు ప్రచారం

కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే బీఆర్ఎస్‌పై తప్పుడు ప్రచారం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. 8లో▸



వట్టిపోతున్న బోర్లు..

వేసవి ప్రారంభ దశలోనే భానుడు ఉగ్ర రూపం దాల్చుతున్నాడు. దీంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

అభినందనలు



బలరాం రాథోడ్‌ను అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

కొడంగల్: ప్రపంచ పర్వతారోహకుడు, గిన్నిస్ బుక్ రికార్డు సాధించిన కొడంగల్ వాసి బలరాం రాథోడ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం అభినందించారు. ఫిబ్రవరి 4న బలరాం సౌత్ అమెరికా అర్జెంటీనాలోని దక్షిణ ఖండంలో గల అతి ఎత్తైన మౌంట్ అకాంక్వాగువా పర్వతాన్ని అధిరోహించారు. పర్వతంపై జాతీయ జెండాను ఎగురవేశారు. రాష్ట్ర ఆదివాసీ వైస్ చైర్మన్ సుభాష్ నాయక్ ఆధ్వర్యంలో బలరాం హైదరాబాద్‌లో సీఎంను కలిశారు. బలరాం రాథోడ్‌కు తమవంతు సహకారం అందిస్తామని సీఎం తెలిపారు. కొడంగల్ కృష్ణవేణి పాఠశాల ప్రిన్సిపాల్ మహ్మద్ మక్సూద్ అలీ బలరామ్‌కు అభినందనలు తెలిపారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

కొడంగల్: జిల్లా వ్యా ప్తంగా ఆదివారం (నేడు)నిర్వహించే పల్స్ పో లియో కార్యక్రమాన్ని విజయవంతం చే యాలని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ రవీంద్ర యాదవ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. 0 నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు చుక్కలమందు వేయించాలని సూచించారు. తాండూరు డివిజన్ పరిధిలో 256 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, బస్టాండ్, రైల్వే స్టేషన్, జిల్లా ప్రభుత్వాస్పతి, జన సాంద్రత గల ప్రదేశాల్లో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదివారం పోలియో డ్రాప్స్ వేయించని వారి కోసం సోమ, మంగళవారాల్లో ఇళ్ల వద్ద పిల్లలకు చుక్కల మందు వేస్తారని తెలిపారు.

'గ్రూప్స్' ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం


ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ రాష్ట్ర బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్స్‌లో ఉచిత కోచింగ్ ప్రారంభిస్తున్నామని, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని టీఎస్ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీ నుంచి కోచింగ్ ప్రారంభం అవుతుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు 2 నుంచి 7వ తేదీ వరకు నేరుగా లక్ష్మీనగర్ కాలనీ,సైదాబాద్, హైదరాబాద్‌లోని బీసీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5 లక్షలలోపు ఉండాలన్నారు. గ్రా డ్యుయేషన్ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా రిజర్వేషన్ ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేసే విధానం ఉంటుందన్నారు. మరిన్ని వివరాల కోసం 040-24071178, 040- 27077929 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అంగన్‌వాడీ గుడ్లు పొలం పాలు



గుడ్లపై అంగన్‌వాడీ ముద్ర

ధారూరు: అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన గుడ్లు పొలంలో పడేసిన ఘటన ధారూరు మండలం నాగారం సమీపంలో శనివారం వెలుగు చూసింది. నాగారంలోని వడ్ల శంకరయ్య పొలంలో దాదాపు 600ల అంగన్‌వాడీ గుడ్లను పడేశారు. ఏజెన్సీ లేదా కేంద్రాల నిర్వాహకులు దుకాణదారులకు గుడ్లు విక్రయించి ఉంటారని ప్రజలు భావిస్తున్నారు. దుకాణాల్లో వాటిని విక్రయించే సమయంలో గుడ్లపై స్టాంప్ ఉండటంతో ప్రజలు ప్రశ్నించి ఉంటారని, విషయం బయటికి వస్తే కేసులు అవుతాయని వ్యాపారులు పొలంలో పడేసి ఉంటారని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పంపిణీ చేయాల్సిన గుడ్ల ను ఇలా పొలాల్లో పడేయడం దారుణమని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రజలు, యువజన సంఘాల నాయకులు కోరుతున్నారు.



పొలంలో పడేసిన గుడ్లు



రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం

నేత్రపర్వంగా రథోత్సవం

పేదల కల్వవల్లి పోలెపల్లి ఎల్లమ్మ రథోత్సవం శనివారం నేత్రపర్వంగా సాగింది. అందంగా ముస్తాబు చేసిన తేరుపై అమ్మవారిని ప్రతిష్ఠించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం బుడగ జంగాలు, కుర్వ, గొల్ల, బైండ్ల వారు జాగరణ చేస్తారు. ఎల్లమ్మ జీవిత ఘట్టాన్ని ఆట పాటల ద్వారా ప్రజలకు తెలియజేస్తారు.

– బొంరాస్‌పేట

ఎల్ఆర్‘ఎస్’

మూడున్నరేళ్లుగా ఎదురుచూపులు

- జిల్లాలోని నాలుగు మున్సిపాల్టీల నుంచి 20,908 దరఖాస్తులు
- 18వేల వరకు పరిష్కారమయ్యే అవకాశం
- ప్రభుత్వానికి సమకూరనున్న రూ.40 కోట్ల ఆదాయం



వికారాబాద్ మున్సిపల్ కార్యాలయం

మున్సిపాలిటీ	దరఖాస్తులు	పరిశీలనలో ఉన్నవి	తిరస్కరించినవి
వికారాబాద్	4,026	3,962	375
తాండూరు	12,258	4,276	11
పరిగి	4,218	1,401	20
కొడంగల్	406	184	04

వికారాబాద్ అర్బన్: ఆరు నెలలుగా మున్సిపాల్టీలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు రావడం లేదు. కార్మికుల వేతనాలు, వాహనాల మరమ్మతుకు నిధులు లేక అధికారులు నానా యాతన పడుతున్నారు. ఇలాంటి కష్టకాలంలో రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌కు మోక్షం కలిగించడంతో అధికారులు ఊపిరి పీల్చుకుంటున్నారు. సర్కారు నిర్ణయంతో చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న లే అవుట్ రెగ్యులేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)దరఖాస్తులకు మోక్షం లభించనుంది. దీంతో జిల్లా వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఈ నెల 31వరకు గడువు

ఎల్ఆర్ఎస్‌కు ఎప్పుడు అవకాశం కల్పిస్తుందా అని మూడున్నర ఏళ్లుగా 20వేలకు పైగా దరఖాస్తుదారులు ఎదురుచూశారు. వారం రోజుల క్రితం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం లబ్ధిదారులకు ఊరటనిచ్చింది. 20 వేల దరఖాస్తుల్లో పక్కాగా 18వేల వరకు పరిష్కారమవుతాయని అధికారులు భావిస్తున్నారు. ప్రజల నుంచి మంచి స్పందన వస్తే ఫీజుల రూపంలో దాదాపు రూ .40 కోట్లకు పైగా ప్రభుత్వానికి ఆదాయం చేకూరనున్నట్లు తెలిసింది. జిల్లాలోని నాలుగు మున్సిపాల్టీలకు కొంత మేర నిధుల కొరత తీరనుంది. మున్సిపాల్టీలు, గ్రామ పంచాయతీల పరిధిలోని అక్రమ లే అవుట్లలో ప్లాట్లను క్రమబద్ధీకరించాలని 2020లో అప్పటి ప్రభుత్వం దరఖాస్తులు తీసుకున్న సంగతి తెలిసిందే. ఆ తర్వాత వివిధ కారణాలతో దరఖాస్తుల అంశం మరుగున పడింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఈ నెల 31వ తేదీలోపు అన్ని దరఖాస్తులను పరిశీలించి సక్రమంగా ఉండి ఆమోదం కాగానే ఫీజులు చెల్లిస్తే ఫైనల్ ప్రొసీడింగ్స్ ఇవ్వనున్నారు.

20,908 దరఖాస్తులు


2020లో నాలుగు మున్సిపాల్టీల్లో వచ్చిన 20,908 దరఖాస్తుల్లో లైసెన్స్‌డ్ సర్వేయర్లు ఆయా ప్లాట్ల విస్తీర్ణం కొలతలు సేకరించడంతో పాటు ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అవే ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను ఇప్పుడు త్వరగా పరిశీలించి క్లియర్ చేసి ఫీజులు కట్టిన వారికి ఫైనల్ ప్రొసిడింగ్స్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగనున్నాయి. గతంలో మాదిరిగానే టౌన్ ప్లానింగ్ అధికారులు, టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్లు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు బృందాలుగా ఏర్పడి ఆయా దరఖాస్తుల వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఫైనల్ చేయనున్నారు. కోర్టు కేసులు ఉన్న భూములు, ఫుల్ ట్యాంక్ లెవల్(ఎఫ్‌టీఎల్), దేవాదాయ, వక్ఫ్, బఫర్ జోన్‌లోని ప్లాట్ల దరఖాస్తులను తిరస్కరించనున్నారు. జిల్లాలో ఈ తరహా దరఖాస్తులు పెద్దగా ఉండవని మున్సిపల్ అధికారులు భావిస్తున్నారు. దరఖాస్తు ఫీజు రూ. 1000 కావడంతో చాలామంది ప్లాట్ల యజమానులు అప్పట్లో ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తే 18వేలకు పైగా దరఖాస్తులు క్లియర్ అయ్యే అవకాశం ఉందని అంటున్నారు. పబ్లిక్ అండ్ సెమీ పబ్లిక్ జోన్, రిక్రియేషనల్ జోన్, ఇండస్ట్రియల్ జోన్, అగ్రికల్చర్ జోన్, ట్రాన్స్‌పోర్టేషన్ జోన్, హెరిటేజ్ కన్జర్వేషన్ జోన్ నివాసాలను అనుమతించరు. ఈ జోన్లలో రెండు వేల వరకు దరఖాస్తులు ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు.

కమలం అభ్యర్థులు ఖరారు

- ఎంపీ క్యాండెట్లను ప్రకటించిన బీజేపీ
- చేవెళ్ల నుంచి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- మల్కాజ్‌గిరి బరిలో ఈటల రాజేందర్



సాక్షి, సిటీబ్యూరో: లోక్‌సభ స్థానాలకు బీజేపీ అధిష్ఠానం అభ్యర్థులను ఖరారు చేసింది. చేవెళ్ల స్థానానికి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మల్కాజ్‌గిరి నుంచి మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను బరిలోకి దింపింది. రాష్ట్రంలో 17 స్థానాలు ఉండగా వీటిలో నాలుగు గ్రేటర్ పరిధిలో ఉన్నాయి. మేడ్చల్-మల్కాజ్‌గిరి స్థానానికి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, పార్టీ కార్యదర్శి మురళీధర్ రావు, సీనియర్ నేత ఎం.కొమురయ్య, కొంపెల్లి మోహన్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా అర్బన్ అధ్యక్షుడు హరీశ్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, హన్మకొండ మాజీ ఎంపీ చాడ సురేశ్‌రెడ్డి పోటీ పడ్డారు. ఇప్పటికే తీవ్ర అసంతృప్తిలో ఉన్న కూన.. తాజా అభ్యర్థుల ప్రకటనతో పునరాలోచనలో పడినట్లు తెలిసింది. పార్టీని వీడే అవకాశం కూడా లేకపోలేదని సన్నిహితులు చెబుతున్నారు. మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలకు పొరుగున ఉన్న భువనగిరి లోక్‌సభ స్థానం నుంచి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్‌కు అవకాశం కల్పించింది. మహబూబ్‌నగర్ స్థానానికి అభ్యర్థిని ప్రకటించలేదు. ఇక్కడి నుంచి మాజీ మంత్రి డీకే అరుణ, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి పోటీ పడుతుండటమే కారణంగా తెలుస్తోంది.



కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
లోక్‌సభ స్థానం: చేవెళ్ల
తండ్రి: జస్టిస్ కొండా మాధవరెడ్డి
స్వస్థలం: బంజారాహిల్స్
విద్యార్హత: కంప్యూటర్ సైన్స్

రాజకీయ నేపథ్యం: 2013లో బీఆర్ఎస్ పార్టీలో చేరి.. 2014లో చేవెళ్ల లోక్‌సభ స్థానం నుంచి గెలుపొందారు. ఆ తర్వాత 2018 నవంబర్‌లో అప్పటి టీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ తరఫున ఇదే లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత 2021 మార్చిలో ఆ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఇప్పటి వరకు బీజేపీలోనే క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఆ పార్టీ నుంచి తన అదృష్టాన్ని మరోసారి పరీక్షించుకోబోతున్నారు.



ఈటల రాజేందర్
లోక్‌సభ స్థానం: మల్కాజ్‌గిరి
తండ్రి: ఈటల మల్లయ్య
స్వస్థలం: కమలాపూర్ (కరీంనగర్ జిల్లా)
విద్యార్హత: డిగ్రీ

రాజకీయ నేపథ్యం: 1964 మార్చి 20న జన్మించారు. 2003లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం టీఆర్ఎస్ పార్టీలో చేరి 2004 ఎన్నికల్లో కమలాపూర్ ఎమ్మెల్యేగా తొలిసారి ఎన్నికయ్యారు. 2008 ఉప ఎన్నికల్లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. వైఎస్ హయాంలో టీఆర్ఎస్ ఎల్పీ నేతగా తన వాగ్ధాటితో అందరినీ ఆకట్టుకున్నారు. 2009 నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా కమలాపూర్ హుజూరాబాద్‌గా మారింది. ఆయన 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వకుళాభరణం కృష్ణమోహన్‌రావుపై, 2010లో జరిగిన ఉప ఎన్నికల్లో ముద్దసాని దామోదరరెడ్డిపై గెలిచి నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కేతిరి సుదర్శన్‌రెడ్డిపై గెలిచి కేసీఆర్ తొలి మంత్రివర్గంలో ఆర్థిక, ప్రణాళిక శాఖ, చిన్నమొత్తాల పొదుపు, పౌర సరఫరాలు, తూనికలు కొలతలు, వినియోగదారుల వ్యవహారాల శాఖల బాధ్యతలు నిర్వర్తించారు. 2019లో కేసీఆర్ రెండో మంత్రివర్గంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా కొనసాగారు. టీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి, ఎమ్మె ల్యే పదవికి 2021 జూన్ 12న రాజీనామా చేసి బీజేపీలో చేరారు. 2021 అక్టోబర్ 30న జరిగిన హుజూరాబాద్ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి 23,855 ఓట్ల మెజారిటీతో గెలిచారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్‌తో పాటు కామారెడ్డిలోనూ పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానం నుంచి తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు.



పరిగి: భూ కబ్జాపై ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

భూ తగాదాల్లో జోక్యం ఉండదు

- ఎస్పీ కోటిరెడ్డి

పరిగి: భూ సమస్యలను కలెక్టర్, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. దోమ మండలం తిమ్మాయిపల్లి సర్వే నంబరు 50/అ/ 1లో గల 1-09గుంటల భూ కబ్జా విషయంలో శనివారం పరిగి ప్రజా సంఘాల నాయకులతో ఎస్పీ చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భూ కబ్జా ఫిర్యాదుపై విచారణ చేపడతామన్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సివిల్, భూ తగాదాల్లో పోలీసుల జోక్యం ఉండదని తెలిపారు. కోర్టుల ద్వా రా పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, గోవింద్, శ్రీనివాస్, సత్తయ్య పాల్గొన్నారు.

అమల్లోకి పీడీ యాక్ట్

అనంతగిరి: జిల్లాలో శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకొని ఈ నెల చివరి దాకా పీడీ యాక్ట్ అమల్లో ఉంటుందని ఎస్పీ కోటిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నా లు, రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించినా, ప్రజాధనానికి నష్టం చేసినా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు.

శ్రీపాదరావుకు ఘన నివాళి

దివంగత స్పీకర్ శ్రీపాదరావు జయంతిని ఎస్పీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎస్పీ కోటిరెడ్డి శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఎస్పీలు అంజయ్య, వీరేష్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో సత్వర పరిష్కారం

షాద్‌నగర్: లోక్ అదాలత్‌ల ద్వారా కేసులను సత్వరం పరిష్కరించుకోవచ్చని షాద్‌నగర్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి అన్నారు. ఈనెల 16న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను పురస్కరించుకొని షాద్‌నగర్ కోర్టు ఆవరణలో శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పెండింగ్ కేసులను పరిష్కరించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు న్యాయవాదులు, పోలీసులు సహకరించాలని కోరారు. సమావేశంలో స్పెషల్ బెంచ్ ఆఫీసర్ రవీంద్రసింగ్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సూరజ్ సింగ్, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ జడ్జి ధీరజ్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రావు, డీఎ రాంరెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ రవీంద్ర నాయక్, ఎస్ఐలు సత్రం, కృష్ణ కుమార్, ఎక్సైజ్ ఎస్ఐ సునీత పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జడ్జిలు, అధికారులు


ధరణి సమస్యల పరిష్కారానికే స్పెషల్ డ్రైవ్

- కలెక్టర్ నారాయణరెడ్డి

అనంతగిరి: ధరణి సమస్యల పరిష్కారానికి ఈ నెల 9వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శనివారం కలెక్టరేట్ నుంచి టెలికాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు దరఖాస్తు చేశారని, వాటిని పరిశీలించి పరిష్కరించే దిశగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తారని తెలిపారు. మండలానికి మూడు బృందాల చొప్పున ఏర్పాటు చేసినట్లు వివరించారు. రైతులు అధికారులకు సహకరించాలని కోరారు.

ప్రజావాణి వాయిదా

జిల్లాలో స్థానిక సంస్థల శాసన మండలి ఎన్నిక ఉన్న నేపథ్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల అనంతరం ప్రజావాణిని నిర్వహించే తేదీని వెల్లడిస్తామని తెలిపారు.



అనంతగిరి: సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

పెండింగ్ పనులు పూర్తి చేయండి

వికారాబాద్ అర్బన్: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను సత్వరం పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. శనివారం టెలికాన్ఫరెన్స్ ద్వారా మండలస్థాయి అధికారులతో మాట్లాడారు. గ్రామ పంచాయతీ భవనాలు, పాఠశాలల ప్రహరీలు, వంటగదుల నిర్మాణాలను వెంటనే పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. అలాగే సీసీ రోడ్ల పనులను పూర్తి చేయాలన్నారు. పనుల్లో నాణ్యత ఉండాలని ఆదేశించారు. అనంతరం మండలాల వారీగా సీసీ రోడ్ల పనుల పురోగతికి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డీఈలు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్‌పై ఫోకస్ పెట్టండి

ధారూరు: ధరణి స్పెషల్ డ్రైవ్‌పై ఫోకస్ పెట్టా లని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. శనివారం ఆయన ధారూరు తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 9వ తేదీలోగా ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని తహసీల్దార్ సాజిదాబేగం, డీటీ విజయ్‌కు సూచించారు.

దరఖాస్తులను పరిష్కరించాలి

అనంతగిరి: ధరణి దరఖాస్తులను ఈ నెల 9లోగా పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై చర్చించారు. భూ సమస్యలను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, డీటీ రాజేందర్‌రెడ్డి, ఆర్ఐలు సురేష్, నరేష్, సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

శంకర్‌పల్లి: దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు పేర్కొన్నారు. మండలంలోని కొండకల్‌లో ఎంపీటీసీ బద్దం సురేందర్‌రెడ్డి సొంత నిధులతో ఏర్పాటు చేసిన 45 అడుగుల అభయాంజనేయ స్వామి ప్రాణప్రతిష్ఠలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ పి.సునీతారెడ్డి, చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు పామెన జ్యోతి, కొండకల్ మాజీ ఎంపీటీసీ బద్దం జ్యోతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హరీశ్‌రావును సత్కరిస్తున్న ఎంపీటీసీ సురేందర్‌రెడ్డి తదితరులు

విగ్రహాన్ని ఆవిష్కరించిన చినజీయర్ స్వామి

అంతకు ముందు గ్రామ శివారులోని శ్రీ రామాలయం నుంచి గ్రామంలోని అభయాంజనేయ స్వామి విగ్రహం వరకు గ్రామస్తులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని త్రిదండి జినజీయర్ స్వామి ఆవిష్కరించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

క్లుప్తంగా

పెంచిన బస్సు చార్జీలు తగ్గించండి

టీఎస్‌ ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు వినతి

తాండూరు టౌన్‌: కోవిడ్‌ సమయంలో పెంచిన ఆర్టీసీ బస్సు చార్జీలను తగ్గించాలని తాండూరుకు చెందిన సామాజిక కార్యకర్తలు ఎండీ ముస్తాఫా రిజ్వాన్‌, ఎం.విజేయందర్‌ కోరారు. ఈ మేరకు శనివారం వారం టీఎస్‌ ఆర్టీసీ మేనేజింగ్‌ డైరెక్టర్‌ సజ్జనార్‌కు వినతిపత్రం అందజేశారు. కరోనా సమయంలో సింగిల్‌ సీటు పద్ధతిలో బస్సు టికెట్‌ చార్జీలను రెండింతలు చేసి వసూలు చేశారన్నారు. కానీ ప్రస్తుతం ఎటువంటి మహమ్మారి లేని కారణంగా పెంచిన బస్సు చార్జీలను తగ్గించాలని కోరుతున్నామన్నారు. తాండూరు నుంచి జహీరాబాద్‌కు రోడ్డు సౌకర్యం బాగున్నప్పటికీ కేవలం రెండు బస్సులను మాత్రమే నడుపుతున్నారని.. ఆ మార్గంలో ప్రజల సౌకర్యార్థం మరిన్ని బస్సులు నడపాలని కోరారు.

మట్కారాయుళ్లు అరెస్ట్‌



పోలీసుల అదుపులో నిందితులు

తాండూరు టౌన్‌: మట్కా ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్‌ చేశారు. ఈ ఘటన శనివారం పట్టణంలోని పాత తాండూరులో చోటు చేసుకుంది. సీఐ సంతోశ్‌కుమార్‌ తెలిపిన ప్రకారం.. అంబేడ్కర్‌ పార్కు సమీపంలో మట్కా ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడిచేశామన్నారు. మట్కా ఆడుతున్న సమీర్‌, జియోదిన్‌, ఖాజాపాషా, రాజు, జగ్గప్ప, ఇలియాస్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.7,560 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, మట్కా చిట్టీలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి బలవన్మరణం

ఇబ్రహీంపట్నం రూరల్‌: మానసిక ఒత్తిడి అనారోగ్యం కారణంగా ఓ సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శనివారం ఆదిబట్ల ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. కరీంనగర్‌ జిల్లాకు చెందిన గున్నాల పూర్ణచందర్‌(36) నాదర్‌గుల్‌ సమీపంలో గ్రీన్‌హోమ్స్‌ కాలనీలో నివాసం ఉండేవారు. భార్య ప్రైవేటు ఉద్యోగి. వీరిద్దరికి ఐదేళ్ల కుమారుడున్నాడు. భార్య ఉద్యోగానికి వెళ్లిన తర్వాత పూర్ణచందర్‌ ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం వచ్చి చూసిన భార్యకు ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చింది. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు

సన్న బియ్యం.. పిరం

నిలకడగా వడ్ల ధరలు

- బ్రాండ్‌ల పేరిట కృత్రిమ కొరత
- నష్టపోతున్న రైతులు, వినియోగదారులు
- పట్టించుకోని అధికారులు

సన్నొడ్ల ధరలో పెరుగుదల లేకున్నా బియ్యం ధరలు పిరమైనాయి. డిమాండ్‌ను ఆసరా చేసుకుని వ్యాపారులు బ్లాక్‌ చేస్తుండడంతో సామాన్యులు కొనలేని పరిస్థితి. అధికారులు స్పందించి వడ్లకు మద్దతు ధర పెంచి.. బియ్యం ధర తగ్గించాలని రైతులు, వినియోగదారులు కోరుతున్నారు.



వికారాబాద్‌: బియ్యం ధరలు ఆకాశన్నంటుతున్నాయి. ఓ పక్క ధాన్యం దిగుబడులు అంచనాకు మించి వస్తుంటే.. బియ్యం ధరలు మాత్రం పైపైకి ఎగబాకుతున్నాయి. వడ్లు.. బియ్యం ధరలకు ఎలాంటి పొంతన ఉండడం లేదు. రైస్‌ మిల్లర్లు మరియు ప్రైవేటు వ్యాపారుల మాయాజాలంతో ఇటు ధాన్యం పండించిన రైతులు, అటు బియ్యం కొనుగోలు చేసే వినియోగదారులకు నష్టం వాటిల్లుతోంది. ధరలు అదుపు చేయాల్సిన అధికారులు మిల్లర్లకే కొమ్ముకాస్తున్నారు. ఆరు నెలలు కష్టపడి ధాన్యం పండించిన రైతుకు క్వింటాల్‌కు రూ.1,800 నుంచి రూ.2,200 వస్తే వాటిని కొనుగోలు చేసి వంద రూపాయల ఖర్చుతో బియ్యంగా మార్చి వారం రోజుల్లో వేలల్లో లాభాలను మూటగట్టుకుంటున్నారు. అయితే ధాన్యం సీజన్‌ ఇటీవలే ముగియగా ఇప్పుడే బియ్యం ధరలు మండిపోతుండడం అధికారుల చేతగానితనానికి.. మిల్లర్ల మాయాజాలానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. అధికారులు స్పందించి బియ్యం ధరలు అదుపుచేయాలని వినియోగదారులు డిమాండ్‌ చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకుని క్వింటాల్‌ సన్న బియ్యం రూ.2,900కే అందజేస్తామని ప్రకటించినా.. ఇప్పటికీ ఆ ఊసే కనిపించడం లేదు.

జీరో పెట్టుబడితో లాభాలు

మిల్లర్లు, వ్యాపారులు రైతు నుంచి క్వింటాల్‌ వడ్లను రూ.2వేల నుంచి రూ.2,100 వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో ఐదు కేజీల తరుగుతో రూ.2,200వరకు కొనుగోలు చేస్తున్నారు. బ్రాండ్‌ల పేరిట క్వింటాల్‌ బియ్యం రూ.6,500 నుంచి రూ.7వేల వరకు విక్రయిస్తుండగా.. ఏ బ్రాండ్‌ వడ్ల ధర క్వింటాల్‌కు రూ.2,200 దాటడం లేదు. క్వింటాల్‌ ధాన్యాన్ని బియ్యంగా మార్చేందుకు మిల్లర్లకు వంద రూపాయాలు ఖర్చు వస్తున్నా అది తవుడు రూపేనా ఆదాయం వస్తుంది. అంటే మిల్లర్లు ధాన్యంగా మార్చేందుకు పెట్టే పెట్టుబడి జీరో(సున్నా). క్వింటాల్‌ వడ్ల నుంచి 65కేజీల బియ్యం వస్తుంది. వ్యాపారులు విక్రయిస్తున్న ప్రకారం కేజీ రూ.70 చొప్పున విక్రయిస్తే రూ.4,550 ఆదాయం. అంటే మిల్లర్లు క్వింటాల్‌ వడ్లపై రూ. 2వేల నుంచి రూ.2,500పైగా లాభాలార్జిస్తున్నారు. ఇదే బియ్యం ఓ రెండు మూడు నెలలు నిల్వ చేసి పాతం బియ్యమంటూ మరింత ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. దీంతో మిల్లర్లు, వ్యాపారులు లాభాలు గడిస్తుండగా.. అన్నదాత, వినియోగదారులు మాత్రం నష్టపోక తప్పడం లేదు.

చోద్యం చూస్తున్న అధికారులు

రైస్‌ మిల్లర్ల అవకతవకలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ప్రభుత్వ యంత్రాంగం స్పందించి మిల్లర్ల ఆగడాలకు అడ్డకట్ట వేస్తే రైతుకు మద్దతు ధరతో పాటు వినియోగదారుడికి సైతం బియ్యం ధరలు అందుబాటులో ఉంటాయి. కానీ పర్యవేక్షించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడక పోవడం విమర్శలకు తావిస్తోంది. వ్యాపారులు బ్రాండ్‌ల పేరిట కృత్రిమ కొరత సృష్టిస్తూ అధిక దరలకు విక్రయిస్తున్నారు.

కొలువు.. వీరికెంతో సులువు

నాలుగు ఉద్యోగాలకు ఎంపికైన మహిపాల్‌, లలిత • పద్మ, నరేశ్‌ ఉస్మాన్‌, శ్రీనివాస్‌కు రెండు

వరుసగా వెలువడుతున్న ఉద్యోగ నియామక ఫలితాల్లో పేదింటి కుసుమాలు తమ ప్రతిభను చాటుతున్నారు. ఒక్కొక్కరు రెండు నుంచి నాలుగు వరకు ఉద్యోగాలు సాధించి తమను తాము నిరూపించుకుంటున్నారు.

• ‘లక్ష్మిగళ్ల’ సరస్వతీ పుత్రుడు



మహిపాల్‌

నవాబ్‌పేట: మండలం పులుమామిడికి చెందిన మహిపాల్‌ నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. లక్ష్మిగళ్ల జంగయ్య, అనంతమ్మలకు పేదింటిలో జన్మించిన మహిపాల్‌ ప్రభుత్వ పాఠశాలలో చదివాడు. నగరంలోని నిజాం కళాశాలలో డిగ్రీ, ఓయూలో పీజీ పూర్తి చేశాడు. పీజీలో ఉండగానే నెట్‌కు, జేఆర్‌ఎఫ్‌కు అర్హత సాధించాడు. ప్రస్తుతం ఓయూ తెలుగు శాఖలో ‘వడ్డెపల్లి కృష్ణ గేయాలు–సమగ్ర అధ్యయనం’ అనే అంశంపై పరిశోధన సాగిస్తున్నాడు. ఈ క్రమంలో 2018లో పంచాయతీ కార్యదర్శి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. గురుకుల ఉద్యోగ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకుతో తన ప్రతిభ కనబరిచాడు. డీఎల్‌, జేఎల్‌(2వ ర్యాంకు), పీజీటీ (2వ ర్యాంకు), టీజీటీ ఉద్యోగాలు సాధించాడు.

• అక్కాతమ్ముడు.. గిరిజన తేజాలు



పద్మ, రమేష్‌

దోమ: గురుకుల ఫలితాలలో మండలానికి చెందిన అక్కాతమ్ముడు ఒక్కొక్కరు రెండేసి ఉద్యోగాలు సాధించి సత్తాచాటారు. దిర్సంపల్లి పంచాయతీకి చెందిన నేనావత్‌ పద్మ గురుకుల పీజీటీలో నియామకపత్రం పొందారు. అనంతరం వెలువడిన గురుకుల జూనియర్‌ లెక్చరర్‌ ఫలితాల్లోనూ ఉద్యోగం సాధించారు. ఆమె సోదరుడు నేనావత్‌ రమేశ్‌ శుక్రవారం వెలువడిన గురుకుల టీజీటీ ఫలితాలలో జనరల్‌ సైన్స్‌ మరియు బయో సైన్స్‌లలో రెండింటిలో ఉద్యోగాన్ని సాధించాడు. ఏకకాలంలో ఇద్దరికీ రెండేసి ఉద్యోగాలు రావడంతో మండల ప్రజలు అబినందనలు వ్యక్తం చేశారు.

• లలితకు ‘నాలుగు’ శాస్త్రాల్లో



లలితకుమారి

దౌల్తాబాద్‌: మండల పరిధిలోని గోకపస్లావాద్‌ గ్రామానికి చెందిన కొండా లలిత కుమారి ఏకకాలంలో నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై ంది. కష్టపడితే సాధించలేనిది ఏమీ లేదని చూపింది. చదువుకు పెళ్లి అడ్డంకి కాదని చాటింది. పేదింటిలో జన్మించిన ఆమె ప్రభుత్వం ప్రకటించిన జూనియర్‌ లెక్చరర్‌ రసాయన శాస్త్రం, పీజీటీ భౌతిక శాస్త్రం, టీజీటీ జీవశాస్త్రం, టీజీటీ జనరల్‌ సైన్స్‌ గురుకుల ఉద్యోగాల పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించి ఏకకాలంలో నాలుగు ఉద్యోగాలకు ఎంపికై ంది. ఒకేసారి నాలుగు ప్రభుత్వ కొలువులు రావడంతో ఆమె భర్త కొండా ప్రశాంత్‌, కుటుంబ సభ్యులు అభినందించారు.

• ఇద్దరికి రెండు



ఉస్మాన్‌



శ్రీనివాస్‌

తాండూరు టౌన్‌: గురుకుల ఫలితాల్లో తాండూరు వాసులు ఇద్దరు రెండేసి ఉద్యోగాలు సాధించి సత్తా చాటారు. పట్టణానికి చెందిన ఉస్మాన్‌ గురుకుల టీజీటీ బయో సైన్స్‌తో పాటు, జనరల్‌ సైన్స్‌లోనూ ఉద్యోగాలు సాధించాడు. పెద్దేముల్‌ మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్‌ గురుకుల కామర్స్‌ జూనియర్‌ లెక్చరర్‌గా, టీజీటీ సోషల్‌ స్టడీస్‌లో ఉద్యోగాలు సాధించారు. ఉద్యోగాలు సాధించిన వారిద్దరినీ తోటి అధ్యాపకులు, సహచరులు అభినందించారు.

రెచ్చిపోతున్న ఇసుకాసురులు

అనుమతి ఓ చోట.. డంప్‌ మరోచోట

తాండూరు రూరల్‌: ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. పోలీసులు కేసులు చేసినా అక్రమార్కుల్లో మార్పు రావడం లేదు. శనివారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను సీజ్‌ చేసి కేసు నమోదు చేశారు. కరణ్‌కోట్‌ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. పాత తాండూరులోని కాగ్నా నది నుంచి పట్టణంలోని సెహ్రూ గంజ్‌కు ఇసుక తరలించేందుకు ఓ ట్రాక్టర్‌ యజమాని పర్మిషన్‌ తీసుకోగా డ్రైవర్‌ చెన్‌గేస్‌పూర్‌లో డంప్‌ చేసేందుకు తరలిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు ట్రాక్టర్‌ను సీజ్‌ చేసి యజమాని ఫజల్‌ ఖాన్‌, డ్రైవర్‌ ప్రకాశంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



ట్రాక్టర్‌ నంబర్‌ కనిపించకుండా అతికించిన స్టిక్కర్‌

పార్క్‌ చేసిన బైక్‌ చోరీ

మొయినాబాద్‌: హోటల్‌ ఎదుట పార్క్‌ చేసిన బైక్‌ చోరీకి గురైంది. ఈ సంఘటన మొయినాబాద్‌ పీఎస్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్‌ జిల్లాకు చెందిన కాత్రావత్‌ ఉత్పల్‌ హిమాయత్‌నగర్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. శుక్రవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో టీఎస్‌ 06 ఎఫ్‌ఎఫ్‌ 9544 నంబరు గల తన రాయల్‌ ఎన్‌ఫీల్డ్‌ బైక్‌పై హిమాయత్‌నగర్‌లోని స్టాన్జా లివింగ్‌ హోటల్‌కు వెళ్లాడు. హోటల్‌ ఎదుట బైక్‌ను పార్క్‌ చేయగా గుర్తి తెలియని వ్యక్తులు చోరీ చేశారు. శనివారం మొయినాబాద్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.

కావాలనే తప్పుడు ప్రచారం

- బీఆర్‌ఎస్‌ పాలనలో లక్షల ఎకరాలకు సాగు నీరందించాం
- పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



మాట్లాడుతున్న మహేశ్‌రెడ్డి

పరిగి: నీళ్లు, నిధులు, నియామకాలపైనే బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో దృష్టి సారించామని కావాలనే కాంగ్రెస్‌ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన పట్టణ కేంద్రంలో తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. గడిచిన పదేళ్లలో రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశామని.. అందుకు ప్రజలు ఎన్నికలేవైనా కారు పార్టీకే పట్టం కట్టారని గుర్తు చేశారు. దేశానికే తెలంగాణను ఆదర్శంగా నిలిపేందుకు కేసీఆర్‌ కృషి చేశారన్నారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడే కాంగ్రెస్‌ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును ప్రారంభించి కాలయాపన చేసిందన్నారు. కాళేశ్వరంపై కాంగ్రెస్‌ నాయకులు తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. కాంగ్రెస్‌ నాయకుల కేసుల వల్లే కేపీ లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పనులు నిలిచాయన్నారు. అధికార కాంగ్రెస్‌ టెండర్లు వేసి త్వరితగతిన పనులు ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్‌ వైస్‌ చైర్మన్‌ భాస్కర్‌, మాజీ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ సురేందర్‌, సీనియర్‌ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, రాజేందర్‌, శ్రీనివాస్‌, హన్మంత్‌రెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.

అక్రమంగా డీజిల్‌ రవాణా

వాహనం సీజ్‌

తాండూరు రూరల్‌: కర్ణాటక రాష్ట్రం నుంచి డీజిల్‌ను అక్రమంగా రవాణా చేస్తున్న ఓ వాహనాన్ని పోలీసులు సీజ్‌ చేశారు. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని జినుగుర్తి గేట్‌ వద్ద పోలీసులు తనిఖీ చేపట్టారు. కర్ణాటక రాష్ట్రం నుంచి వస్తున్న వాహనాన్ని పరిశీలించగా నిబంధనలకు విరుద్ధంగా డ్రమ్ముల్లో తాండూరుకు డీజిల్‌ తరలిస్తున్నారు. సరైె పత్రాలు లేక పోవడంతో వాహనాన్ని సీజ్‌ చేసి డ్రైవర్‌పై బసప్ప కేసు దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు

కిరాణా దుకాణంలో నకిలీ సామగ్రి

- టాస్క్‌ఫోర్స్‌ పోలీసుల దాడులు
- కాలం చెల్లిన కొబ్బరినూనె, నిషేధిత సిగరెట్‌ ప్యాకెట్లు స్వాధీనం

కుల్కచర్ల: ఓ కిరాణా దుకాణంలో కాలం చెల్లిన సామగ్రిని సీజ్‌ చేసి యజమానిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ అన్వేశ్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల కేంద్రంలో బుసని శ్రీనివాస్‌ అలియాస్‌ సిరాజ్‌ అనే వ్యక్తి కిరాణ దుకాణంలో నకిలీ సామగ్రి విక్రయిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్‌ అధికారులు, స్థానిక పోలీసులు దాడులు నిర్వహించారు. కాలం చెల్లిన కొబ్బరి నూనె డబ్బాలు, నిషేధిత సిగరెట్‌ ప్యాకెట్లు లభ్యమయ్యాయి. వాటిని సీజ్‌ చేసిన పోలీసులు నిందితుడిపై కసు నమోదు చేశారు.



సీజ్‌చేసిన సామగ్రితో నిందితుడు సిరాజ్‌

నీటి సంపులో పడి చిన్నారి దుర్మరణం

మొయినాబాద్‌: ఆడుకుంటూ వెళ్లి నీటి సంపులో పడి ఏడాదిన్నర వయసున్న బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ సమీపంలోని ఓ ఫాంహౌస్‌లో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రం బిలాస్‌పూర్‌ గ్రామానికి చెందిన కాండేశం కార్తీక్‌ కుటుంబంతో సహా రెండు నెలల క్రితం మొయినాబాద్‌కు వలస వచ్చాడు. అప్పారెడ్డిగూడలో ఉంటూ గ్రామ శివారులో నిర్మిస్తున్న ఫాంహౌస్‌లో పని చేస్తున్నారు. శనివారం కార్తీక్‌ అతని కొడుకు, కోడలు, ఇద్దరు మనవలను తీసుకుని ఫాంహౌస్‌లో భవన నిర్మాణ పనికి వెళ్లారు. పెద్దవాళ్లు మొదటి అంతస్తులో పని చేస్తుండగా పిల్లలు అక్కడే ఆడుకున్నారు. తల్లి, ఇద్దరు పిల్లలకు అన్నం తినిపించి నీళ్లు తేవడానికి కిందికి వెళ్లింది. ఈ సమయంలో చిన్న పిల్లాడు ఎస్స్‌ ఖాండే(18 నెలలు) ఆడుకుంటూ వెళ్లి మొదటి అంతస్తులో నిర్మించిన నీటి సంపులో పడ్డాడు. వెంటనే గమనించి స్థానిక భాస్కర ఆస్పత్రికి, అక్కడి నుంచి నీలోఫర్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మతిస్థిమితం లేని చిన్నారి.. నీటి గుంతలో పడి మృతి

ఇక్కారెడ్డిగూడలో ఘటన

చేవెళ్ల: మతిస్థిమితం లేని చిన్నారి ఆడుకుంటూ వెళ్లి నీటి గుంతలో పడి మృతిచెందింది. మండల పరిధిలోని చనువెళ్లి అనుబంధ గ్రామమైన ఇక్కరెడ్డిగూడలో శనివారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా దర్శి మండలం రాజంపల్లికి చెందిన మత్తయ్య, సారమ్మ దంపతులు బతుకుదెరువు నిమిత్తం పదేళ్ల క్రితం షాబాద్‌ మండలంలోని నాగరగూడకు వచ్చి, ఇక్కడే జీవనం సాగిస్తున్నారు. చుట్టు పక్క గ్రామాల్లో కూలీ పనులకు వెళ్తూ ముగ్గురు పిల్లలను పోషించుకుంటున్నారు. వీరిలో ఇద్దరు పిల్లలు పాఠశాలకు వెళ్తుండగా.. మౌనిక(10)కు మతిస్థిమితం సరిగా లేదు. దీంతో తల్లి సారమ్మ నిత్యం పాపను తనవెంటే తీసుకెళ్తోంది. ఇందులో భాగంగా శనివారం ఇక్కారెడ్డిగూడకు రైతు కుర్వ విఠలయ్య పొలంలో పనికి వెళ్లింది. ఎప్పటిలాగే మౌనికను సైతం తీసుకెళ్లింది. తల్లి పనుల్లో నిమగ్నమై ఉండగా ఆడుకుంటూ వెళ్లిన బాలిక పొలం పక్కనే ఉన్న నీటి నిల్వ గుంతలో పడిపోయింది. కొద్ది సేపటి తర్వాత కూతురు కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన సారమ్మ అటుఇటు వెతుకుతుండగా ఫాంపాండ్‌ పడిపోయి కనిపించింది. దీంతో గుండెలు బాదుకుంటూ కేకలు వేసింది. రైతు విఠలయ్య పరుగున వచ్చి బాలికను బయటకు తీశాడు. అపస్మారక స్థితిలో ఉన్న మౌనికను చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తల్లి సారమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

అవిశ్వాసం వీగినట్లేనా..?

- 5న నిర్వహించే సమావేశానికి కాంగ్రెస్‌ కౌన్సిలర్లు దూరం
- మున్సిపల్‌ ఛైర్‌పర్సన్‌ మల్‌రెడ్డి అనురాధ



మాట్లాడుతున్న మల్‌రెడ్డి అనురాధ

తుర్కయంజాల్‌: తుర్కయంజాల్‌ మున్సిపల్‌ వైస్‌చైర్మన్‌ పెట్టిన అవిశ్వాసం వీగినట్లేనా అంటే అవుననే సమాధానమే వస్తోంది. పాలక వర్గం అవిశ్వాస తీర్మాణానికి ఇచ్చిన నోటీసుల ప్రకారం ఈ నెల 5న సమావేశం నిర్వహించనున్నారు. కాగా ఈ సమావేశానికి కాంగ్రెస్‌ కౌన్సిర్లు దూరంగా ఉంటున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు శనివారం మున్సిపల్‌ ఛైర్‌పర్సన్‌ మల్‌రెడ్డి అనురాధ రెడ్డి తొర్రూర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీలోని పాలకవర్గంలో విబేధాల కారణంగా వైస్‌ఛైర్‌పర్సన్‌ గుండ్లపల్లి హరితపై అవిశ్వాసం పెట్టాలని కొంతమంది కౌన్సిలర్లు నిర్ణయించుకుని కలెక్టర్‌కు నోటీసులు ఇచ్చారన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి జోక్యం చేసుకుని విభేదాలను చక్కదిద్దడంతో వివాదం ముగిసిందన్నారు. కొన్ని రోజులుగా నెలకొన్న ఈ ఉత్కంఠకు తెరపడింది. కేవలం బీఆర్‌ఎస్‌, బీజేపీలకు చెందిన కౌన్సిలర్లు హాజరైతే సరిపడా కోరం ఉండదని.. దీంతో అవిశ్వాసం వీగిపోయే అవకాశం ఉందని ఆమె చెప్పారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు కోశిక ఐలయ్య, కంబాలపల్లి ధన్‌రాజ్‌, నారని కవిత, బాల్‌రాజ్‌, కాకుమాను సునీల్‌, నాయకులు మల్‌రెడ్డి రాంరెడ్డి, గుండ్లపల్లి ధన్‌రాజ్‌ గౌడ్‌, మేతరి దర్శన్‌, కుంట గోపాల్‌రెడ్డి, రేవల్లి యాదగిరి, గుండ ధన్‌రాజ్‌, బొక్క వంశీధర్‌ రెడ్డి, ఎండీ గౌస్‌ పాషా తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యమే ప్రాణం తీసింది

ప్రైవేటు ఆస్పత్రి ఎదుట మృతుడి బంధువుల ఆందోళన

షాద్‌నగర్‌ రూరల్‌: వైద్యుల నిర్లక్ష్యంతో నిండు ప్రాణం పోయిందని ఆరోపిస్తూ మృతుడి కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ ఘటన శనివారం రాత్రి షాద్‌నగర్‌లోని బుగ్గారెడ్డి ఆస్పత్రిలో చోటుచేసుకుంది. వివరాలు ఉన్నాయి.. పట్టణంలోని చటాన్‌పల్లికి చెందిన నాగేశ్వర్‌రావు (52) ఆస్తమాతో బాధపడున్నాడు. దీంతో నాలుగు రోజుల క్రితం అతన్ని ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స కొనసాగుతోందని, అంతా బాగుందని చెప్పిన నిర్వాహకులు ఇప్పటివరకు రూ.లక్షా, యాభై వేలు వసూలు చేశారు. ఉన్నట్టుండి శనివారం సాయంత్రం నాగేశ్వర్‌రావు పరిస్థితి విషమంగా ఉందని సిబ్బంది చెప్పారు. ఆందోళనకు గురైన బంధువులు సంబంధిత వైద్యుడిని సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులో రాలేదు. కొద్ది సమయం గడిచిన తర్వాత నాగేశ్వర్‌రావు మృతిచెందాడని చెప్పారన్నారు. ఆగ్రహానికి గురైన బాధితులు ఆస్పత్రి ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నిరసనకారులకు నచ్చజెప్పారు.



ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

కాంగ్రెస్‌ అభ్యర్థిని గెలిపిద్దాం

జెడ్పీ ఛైర్‌పర్సన్‌ సునీతారెడ్డి

మొయినాబాద్‌రూరల్‌: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ అభ్యర్థి గెలుపునకు కలిసికట్టుగా కృషి చేద్దామని వికారాబాద్‌ జెడ్పీ ఛైర్‌పర్సన్‌ సునీతారెడ్డి అన్నారు. కాంగ్రెస్‌ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్‌, టీపీసీసీ సభ్యుడు షాబాద్‌ దర్శన్‌, కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు మాణయ్య ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ మనోజ్‌కుమార్‌, మాజీ ఉప సర్పంచ్‌ యాలాల జైపాల్‌రెడ్డి, బాలరాజు, సర్దార్‌నగర్‌ మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ రవీందర్‌రెడ్డి తదితరులు శనివారం సునీతారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆమె కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామాల్లో గడప గడపకు ఆరు గ్యారంటీలపై అవగాహన కల్పిస్తూ కాంగ్రెస్‌ గెలుపనకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంచంద్రారెడ్డి, రాంరెడ్డి, కేబుల్‌ రాజు, మాధవరెడ్డి, జంగారెడ్డి, మహేందర్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, సంజీవరెడ్డి, భిక్షపతి, వెంకట్‌రెడ్డి, పెంటారెడ్డి, రాజేశ్వర్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల రికవరీ

ఇబ్రహీంపట్నం రూరల్‌: శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారయణ అన్నారు. ఠాణా పరిధిలో సెల్‌ఫోన్‌ పోగట్టుకున్న బాధితుల ఫిర్యాదు మేరకు రూ.4.5లక్షల విలువైన 18 సెల్‌ఫోన్‌లను ఇబ్రహీంపట్నం పోలీసులు రికవరీ చేశారన్నారు. శనివారం స్టేషన్‌లో పోగొట్టుకున్న వారికి తమ ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేసేందుకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటారన్నారు. సెల్‌ఫోన్ల రికవరీకి యత్నించిన క్రైమ్‌ హెడ్‌ కానిస్టేబుల్‌ సత్యనారాయణ, నగేశ్‌, కోటేశ్వర్‌రావు, బాబు, శ్రీలత, కవితలను అభినందించారు.



బాధితులకు సెల్‌ఫోన్లు అందజేస్తున్న సీఐ సత్యనారయణ

డివైడర్‌ను ఢీకొట్టిన బైక్‌

నందిగామ: బైక్‌ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ దుర్ఘటన శనివారం మండల కేంద్రం శివారులోని చంద్రాయాన్‌గూడ సమీపంలో పాతజాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ ప్రసాద్‌ తెలిపిన ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన భీకారం చౌదరి(38) నగరంలోని కూకట్‌పల్లిలో నివాసం ఉంటూ కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఆయన షాద్‌నగర్‌లో ఉండే బంధువుల వద్దకు బైక్‌పై వెళ్తున్నాడు. చంద్రాయాన్‌గూడ సమీపంలోకి రాగానే బైక్‌ అదుపుతప్పి రోడ్డు మధ్యనున్న డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో ఆయన తలకు బలమైన గాయాలవ్వడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడి కుమారుడు దీపక్‌చౌదరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్‌ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

కార్మికుడి దుర్మరణం